స్వశక్తి రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి 8

8 ఉపాధి కల్పించే వరకు రిలే దీక్షలు



రైతు నేస్తాలు

- అన్నదాతలకు ఉపయోగకరంగా రైతు వేదికలు
- వేదికల్లో సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు
- ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు
- ప్రతీ మండలంలో ఏర్పాటుకు చర్యలు
- మంగళవారం పంటలపై అవగాహన
- త్వరలోనే సేవలు ప్రారంభం
- జిల్లాలో 57 రైతు వేదికలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అలంకార ప్రాయంగా మారిన రైతు వేదికలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. పటిష్టంగా మార్చి రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు వేదికలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరి జ్ఞానాన్ని జోడించి వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సలహాలు, సూచనలు అందించేందుకు రైతు నేస్తాలుగా తీర్చిదిద్దుతోంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు బంధు సమితిలను ఏర్పాటు చేసింది. వాటికి అనుగుణంగా రైతు వేదికల నిర్మాణాలను చేపట్టింది. రైతుబంధు సమితులు ఉత్సవ విగ్రహాలుగా మారితే వేదికలు నామామాత్రంగా మిగిలిపోయాయి. జిల్లాలో 57 రైతు వేదికలను నిర్మించారు. ఎన్‌ఆర్‌జీఎస్ నుంచి రూ.8 లక్షలు, వ్యవసాయ శాఖ నుంచి రూ.12 లక్షలు కలిపి రూ.20 లక్షలతో హాలు, రెండు గదులతో వేదికలను నిర్మించారు. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని ప్రారంభించారు. వాటి నిర్వహణకు ప్రభుత్వం నెలకు రూ.9 వేల చొప్పున కేటాయించినా అందకపోవడంతో రైతులకు శిక్షణ కార్యక్రమాలు లేక గత ప్రభుత్వ హయాంలో అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దుతోంది. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఉన్నతా. దికారుల సలహాలు, సూచనలు అందించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఉత్సవ విగ్రహాలుగా మా రిన జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలో 171 రెవెన్యూ గ్రామాలు ఏర్పాటు చేసిన రైతు బంధు సమితులను రద్దు చేసింది. రైతు వేదికలను ప్రయోగాత్మకంగా తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి సాంకేతిక పరిజ్ఞానంతో రైతు నేస్తం కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా అందించింది. అందులో వేములవాడ నియోజకవర్గంలో మారు పాక, సిరిసిల్ల నియోజకవర్గంలో చంద్రంపేటను ఎంపిక చేసి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

రెండో విడత మండలానికి ఒక కేంద్రం

తొలి విడతలో శాసనసభ నియోజక వర్గ స్థాయిలో జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రెండు చోట్ల మాత్రమే రైతు నేస్తం కార్యక్రమాలు కొనసాగుతుండగా రెండో విడతలో మండలానికి ఒకటి చొప్పున మరో 11 చోట్ల రైతు నేస్తం కార్యక్రమాలకు ఏర్పాటు చేశారు. జిల్లాలో రైతు నేస్తం కార్యక్రమాలు 13 చోట్ల రైతులకు అందుబాటులోకి రానున్నాయి. వేములవాడలో మారుపాక, చందుర్తి మండలంలో చందుర్తి, బోయినపల్లిలో కొదురుపాక, కోనరావుపేటలో నిజామాబాద్, వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట, తంగళ్లపల్లిలో తాడూరు, గంభీరావుపేటలో నర్మాల, ముస్తాబాద్‌లో బందనకల్, సిరిసిల్లలో చంద్రంపేట, ఎల్లారెడ్డిపేటలో బోప్పాపూర్, ఇల్లంతకుంట, వీర్నపల్లి, రుద్రంగి మండల కేంద్రాల్లోని రైతు వేదికలను రైతు నేస్తం వేదికలుగా ఎంపిక చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా పంటలపై రైతులకు సాంకేతికతను జోడించి సలహాలు, సూచనలు అందించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన రైతు వేదికల్లో ప్రభుత్వం రూ.3.70 లక్షల వరకు ఖర్చు చేసి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ కార్యక్రమం సందర్భంగా రైతులతో సంభాషించే విధంగా రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లను వినియోగించుకున్నారు.

గంటన్నరపాటు కార్యక్రమాలు

జిల్లాలోని 13 రైతు వేదికల ద్వారా రైతు నేస్త కార్యక్రమాలను ప్రతీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పంటల ఉత్పత్తి, సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ, ఎరువులు, పురుగుల మందుల నివారణతో పాటు ప్రభుత్వ పథకాలపై సలహాలు సూచనలు అందించనున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.43 లక్షల ఎకరాల వరకు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రైతు నేస్తం కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు.

రైతు నేస్తం ప్రయోజనకరం

- భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో గతంలో రెండు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతు నేస్తం కార్యక్రమాలు అందించే వారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్యక్రమాలను విస్తరిస్తూ మండలానికో కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో 13 కేంద్రాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. శాస్త్ర వేత్తలు, నిపుణులు అందించే సలహాలు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. రైతులు ప్రతీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

గవర్నర్‌ను కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 31: తెలంగాణ గవర్నర్‌గా నూతనంగా నియామకమైన జిష్ణుదేవ్ వర్మను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రమాణస్వీకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

ఇల్లంతకుంట, జూలై 31: మండలంలోని రేషన్ దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు బుధవారం పొత్తూర్, నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి, ఇల్లంతకుంట గ్రామాలలోని రేషన్ దుకాణాలలోని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలను నడుపాలని, రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ తహసీల్దార్ దినేష్ రెడ్డి, డీటీ నవీన్, ఆర్‌ఐ షఫీ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ పెంచలయ్య



సిరిసిల్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆస్పత్రుల సమన్వయ అధికారిగా డాక్టర్ పి.పెంచలయ్య బుధవారం జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాకు చెందిన డాక్టర్ పెంచలయ్య సర్జన్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు. రికార్డు స్థాయిలో ఆపరేషన్లు చేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను పారదర్శకంగా అందిస్తానని తెలిపారు. అంతకుముందు ఆస్పత్రి సిబ్బంది పెంచలయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టల్‌శాఖ పథకాలపై అవగాహన

ఇల్లంతకుంట, జూలై 31: మండలంలోని వెల్జీపూర్‌లో పోస్టల్‌శాఖ పథకాలపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ గజ్జల వేణు మాట్లాడుతూ పొదుపు కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఉపయోగపడుతుందన్నారు. అన్నిశాఖల కంటే ఎక్కువగా పోస్టల్ శాఖలో వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వివిద పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉడుతల వెంకన్న, పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్, పోస్టల్ సిబ్బంది సాయిరాం పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పవర్ కట్.. నిలిచిన సేవలు

వేములవాడ టౌన్, జూలై 31: వేములవాడ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సెస్ అధికారులు పవర్ నిలిపివేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం సెస్ బకాయి చెల్లించకపోవడంతో మంగళవారం సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో మంగళవారం, బుధవారం ఉదయం ఇన్‌వర్టర్‌తో విధులు నిర్వర్తించారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో బ్యాటరీ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు ఏమి చేయలేని పరిస్థితిలో ఉండి పోయారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బోయినపల్లి, జూలై 31: ఆయిల్‌పాం సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారిని జ్యోతి అన్నారు. బోయినపల్లి మండలం విలాసాగర్‌లో ఆయిల్‌పాం ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పండ్లు, ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేములవాడ, సిరిసిల్ల ఉద్యాన అధికారులు గోవర్ధన్, స్రవంతి పాల్గొన్నారు

ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి

ముస్తాబాద్, జూలై 31 : మండలంలోని బందనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రఖ్యాత హిందీ రచయిత ఉపన్యాస సామ్రాట్‌గా పేరుపొందిన మున్షీ ప్రేమ్‌చంద్ జయంతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

చందుర్తి, జూలై 31: చందుర్తి మండలంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ఏఎస్పీ శేశాద్రినీ రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. మల్యాలలో రొండి బాలవ్వను కులం పేరుతో దూషించిన సంఘటనలో గ్రామానికి చెందిన పులి వికాస్‌పై, కొత్తపేటలో ప్రవీణ్‌ను దూషించిన సంఘటనలో ప్రసాద్, స్వామిపై అట్రాసిటీ కేసు నమోదైంది. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ టౌన్, జూలై 31 : వేములవాడలోని పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు మున్సిపల్ నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వర్షకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం రోడ్ల మరమ్మతుపై తీర్మానించినట్లు తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వేములవాడ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మైక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో మున్సిపల్ సిబ్బంది డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వార్డులలో పేరుకుపోయిన, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తచెదారాన్ని తొలగించాలన్నారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే స్థానిక కౌన్సిలర్‌ల దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ అన్వేష్, వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

మున్సిపల్ సమావేశంలో ఆమోదం

సిరిసిల్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్, సంతాన నియంత్రణకు సర్జరీల కోసం రూ.16.50 లక్షలు ఖర్చు చేయడానికి మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్‌లో వీధికుక్కల బెడదపై చర్చించారు. గతంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, సర్జరీలకు సంబంధించి ప్రతీ కుక్కకు రూ.1600 చొప్పున చెల్లించే విధంగా హైదరాబాద్‌కు చెందిన సొసైటీకి ఆర్డర్ ఇచ్చారు. ఆర్డర్ ప్రకారం వెయ్యికుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించారు. వర్క్ ఆర్డర్‌కు మించి వెయ్యి కుక్కలకు అదనంగా 694కుక్కలకు చికిత్స చేశారు. ఇదే క్రమంలో మరోసారి వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న దృష్ట్యా మరోసారి ఎజెన్సీకి ప్రతీ కుక్కకు రూ.1650 చొప్పున రూ.16.50 లక్షలు మున్సిపల్ జనరల్ నిధుల నుంచి ఖర్చు చేయడానికి పాలకవర్గం ఆమోదించింది. పట్టణంలోని సీసీ రోడ్లు దెబ్బతినడంతో రూ.10 లక్షలతో మరమ్మతు చేయాలని తీర్మానించారు. సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహణలో ఉన్న మ్యూజికల్ ఫౌంటేన్ మరమ్మతుకు రూ.4.75 లక్షలు ఖర్చు చేయడానికి నిర్ణయించారు. నీటి శుద్ధి కేంద్రం వద్ద స్లూయిజ్ వాల్వ్ చెడిపోవడంతో ఏర్పాటు చేయడానికి రూ.20 లక్షలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెచ్చించడానికి నిర్ణయించారు. ఎఫ్‌ఎస్‌టీ నిధులు చెల్లించడానికి ఆమోదించారు. సిరిసిల్ల పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి మురికి కాలువ నిర్మాణం, కల్వర్టుల కోసం రూ.9.60 లక్షల నిధులకు మంజూరి ఇచ్చారు.

15 అంశాల ఆమోదం

సిరిసిల్ల అభివృద్ధి కోసం మున్సిపల్ సాధారణ సమావేశంలో 15 అంశాలపై చర్చించి కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి తెలిపారు. పట్టణంలో వర్షాకాలం దృష్ట్యా సీసీ రోడ్ల మరమ్మతుతోపాటు వీధికుక్కల నివారణలో భాగంగా శస్త్ర చికిత్సలు చేయడానికి ప్రత్యేక నిధులను కేటాయించినట్లు చెప్పారు. నిత్యం పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు సేఫ్టికిట్స్, రెయిన్ కోట్స్, ఇతర పనిముట్ల కొనుగోలుకు నిధులు కేటాయించామన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి

ఉద్యోగులకు సన్మానం

సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులకు స్వాగతం పలుకుతూ మున్సిపల్ కౌన్సిల్ వారిని సన్మానించింది. ఉద్యోగులు పారదర్శకంగా బాధ్యతలు నిర్వహించాలని సూచించింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, డీఈ ప్రసాద్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి

వేములవాడ రూరల్, జూలై 31: సైబర్ మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి అన్నారు. మండలంలోని వట్టెంలలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ప్రజలు సైబర్ మోసాల ఉచ్చులో పడవద్దని అన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబరులో ఫిర్యాదు చేయాల న్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు సహకారం అందించాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా 100కు డయల్ చేయాలన్నారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి పాల్గొన్నారు.

నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి



ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గంభీరావుపేట, జూలై 31 : పాత నేరస్తులు నేర ప్రవృత్తిని మార్చుకోవాలని, సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ అఖిల్ మహజన్ సూచించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. పాత నేరస్తులు వారి ప్రవర్తన మార్చుకోని పక్షంలో హిస్టరీ షీట్స్, పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. గంజాయి, దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్తులపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, గంజాయిని అరికట్టేందుకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని, గంజాయి పాజిటీవ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటామని అన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ అఖిల్ మహజన్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల్లో జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రోకార్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలకు సంబంధించి పూర్తి సమాచారం ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా అధికారులకు తక్షణమే తెలపాలన్నారు. ఎస్పీ వెంట సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై రామ్మోహన్ ఉన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కరీంనగర్ టౌన్, జూలై 31: గంజాయి, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచివారితో స్నేహం చేసి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.జగన్మోహన్‌రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్, కామర్స్)లో విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా మంచి అలవాట్లతో ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తములుగా సమాజానికి సేవ చేసే విధంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సత్యవర్ధన్‌రావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ రాబర్ట్, మహిళాశిశు సంక్షేమశాఖ అధికారి శాంత, జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, కలాశాల అధ్యాపకులు వి.రవీందర్‌రెడ్డి, బి.సంపత్, జి.జాన్సన్, రమణాచారి, శశిధర్ శర్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ అద్దె బస్సులు

భగత్‌నగర్, జూలై 31: రానున్న శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అద్దె ప్రాతిపదికన వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అద్దె ప్రాతిపదికన బస్సులు అవసరమైన వారు ఆయా డిపోల్లో సంప్రదించాలన్నారు. గోదావరిఖని 9959225922, హుస్నాబాద్ 9959225930, హుజూరాబాద్ 9959225924 కరీంనగర్-1 డిపో 9959225920, కరీంనగర్-2 9959225921, మంథని 9959225923, జగిత్యాల 9959225925, కోరుట్ల 9959225928, మెట్‌పల్లి 9959225927, సిరిసిల్ల 9959225929, వేములవాడ 9959225926 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణమునకు 11 డిపోల పరిధిలో ముందస్తుగా బస్సులను బుక్ చేసుకోవాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పడిగెల శ్రీనివాస్

జగిత్యాలరూరల్, జూలై 31: జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల శ్రీనివాస్ (44) అనే రైతు అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన ఆరెకరాల వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల రూ. 20 లక్షలు అప్పుచేసి గేదెల ఫామ్ నడిపించి నష్టాలపాయ్యాడు. బుధవారం ఉదయం శ్రీనివాస్ తన పొలం వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

● నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు

పెద్దపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 5,914 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1217 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4,697 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.715 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ ద్వారా 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ప్రాజెక్టులోకి వరద నీరు రాక పోవడంతో ఎత్తిపోతల్లో భాగంగా ఒక మోటార్‌ను నిలిపి వేశారు. ఇప్పటి వరకు సుమారు నాలుగు టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.

గాయత్రి పంప్ హౌస్ నుంచి...

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఐదో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. మూడు రోజులుగా ఐదు పంపుల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు బుధవారం ఓ పంపును తగ్గించారు. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా విడుదలను యదావిధిగా సాగిస్తున్నారు. 4 పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్‌ఆర్‌ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలి వెళ్తున్నది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని 4 పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం ఉప్పొంగుతూ ప్రవహిస్తోంది.గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరదకాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతోంది. నీటిని విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలలో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది.


గాయత్రి పంప్‌హౌస్ నుంచి విడదలవుతున్న నీరు

మిడ్ మానేరుకు 14 వేల క్యూసెక్కులు...

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు 14,814 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు గాను 309.45 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.55 టీఎంసీల మేరకు నీటి నిల్వ ఉంది.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 8,278 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 36.075 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.133 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.578 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

జాలరికి చిక్కిన 30 కిలోల చేప


30కిలోల భారీ చేపతో జాలరి కూర పురుషోత్తం

కరీంనగర్ టౌన్, జూలై 31: కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయం (ఎల్‌ఎండీ)లో బుధవారం జాలరి చేపలు పడుతుండగా 30 కిలోల భారీ చేప వలలో పడింది. కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన జాలరి కూర పురుషోత్తం ఎల్‌ఎండీలో చేపల వేటకు వెళ్లాడు. ఆయన వల వేయగా 30 కిలోల చేప (బొచ్చె) వలలో పడింది. దీనితో ఆయనతో పాటు అక్కడనున్న జాలర్లు, సందర్శకులు ఆ చేపను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎల్‌ఎండీ జలాశయంలో ఇంత పెద్ద చేప దొరకడం అరుదని పురుషోత్తం తెలిపారు. ఈ చేపను కిలో 110 రూపాయల చొప్పున 3,300 రూపాయలకు విక్రయించాడు.



దుర్శేడ్‌లో ఇద్దరికి డెంగ్యూ

కరీంనగర్ రూరల్, జూలై31: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఇటీవల రెండు డెంగ్యూ కేసులు నిర్ధారణ అయ్యాయి. గ్రామానికి చెందిన బుర్ర ప్రణయ్, వడ్లూరి లక్ష్మీకి మూడు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండగా డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. వెంటనే మండల అధికారులు గ్రామానికి చేరుకుని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో పలు కాలనీల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించారు. ఇళ్లల్లో నీరు నిలిచిన వాటిని గుర్తించి తొలగించారు. మండల పంచాయతీ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి సంజీవరెడ్డి, ఆశా వర్కర్లు గ్రామంలో పర్యటించి డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, జూలై 31: గంభీరావుపేట మండలం ముచ్చర్ల తండాకు చెందిన భూక్య దేవదాస్ (45) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని దేవదాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఇల్లు కట్టడం వల్ల దేవదాస్ అప్పుల పాలయ్యాడు. ఏడాది కిందట తన కొడుకు గల్ఫ్‌లో మృతి చెందాడు. మరోవైపు అప్పుల ఒత్తిళ్లు కావడంతో దేవదాస్ మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు.

గిరిజన రైతు అత్మహత్యాయత్నం

వీర్నపల్లి, జూలై 31: వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలో బుధవారం రాత్రి గిరిజన రైతు పురుగుల మందు తాగి ఉత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం బాబాయ్ చెరువు తండాకు చెందిన అజ్మీరా రాజు అనే గిరిజన రైతు అటవీ భూముల్లో పంటను సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనరైతు అటవీ శాఖ బీట్ అధికారి కిరణ్ మధ్య వాగ్వాదం జరిగింది. తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఎల్లా రెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఫారెస్ట్ బీట్ అధికారి తనపై దాడిచేశాడంటూ అవేదన చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రాజు తెలిపాడు. ఈ సంఘటనపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్‌ను వివరణ కోరగా అటవీ భూమిని సాగు చేస్తున్నాడనే సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లిన బీట్ అధికారిపై గిరిజన రైతు రాజు దాడి చేసినట్లు పేర్కొన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,జూలై31:మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొర్కల్ గ్రామ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న టాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. టాక్టర్ డ్రైవర్ అజారోద్దిన్ ఓనర్ వీరవేణి అంకుస్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐతెలిపారు.అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

- ఏసి చంద్రశేఖర్ మెదక్‌కు బదిలీ - కొండగట్టు ఈఓగా రామకృష్ణారావు


కరీంనగర్ కల్చరల్, జూలై 31: దేవాదాయ శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. దీర్ఘకాలంగా ఉన్న సిబ్బందిని, అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి బదిలీల ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్‌గా, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ ఇంచార్జ్ ఈఓగా ఉన్న ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లా ఏసిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరో ఒకరు సీనియర్ అధికారి అదనపు బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కొండగట్టు ఆలయ ఈఓగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం రామకృష్ణారావు రానున్నారు. నిజామాబాద్ ఇంచార్జ్ ఏసీగా, కరీంనగర్ కార్యాలయంలో సూపరెండెంట్‌గా పనిచేస్తున్న నాయిని సుప్రియ స్థానంలో బాసర ఇంచార్జ్ ఈఓగా ఉన్న విజయరామారావు రెగ్యులర్ నిజామాబాద్ ఏసిగా వ్యవహరించనున్నారు. అలాగే పలువురు ఈఓలకు కూడా స్థాన చలనం జరిగింది. ఇటీవల గ్రేడ్-2 ప్రమోషన్ పొందిన నాగారపు శ్రీనివాస్ కరీంనగర్ జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయానికి బదిలీ అయ్యారు. ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి ఆలయంలో పనిచేస్తున్న గ్రేడ్-1 ఈఓ సుధాకర్‌ను కరీంనగర్ మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో గ్రేడ్-2 ఈఓగా పనిచేస్తున్న ఎండపల్లి మారుతి గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ఈఓగా బదిలీ అయ్యారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో పనిచేస్తున్న గ్రేడ్-2 ఈఓ నాగుల అనిల్‌కుమార్ తిమ్మాపూర్ మండలం నల్లగొండ సీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గ్రేడ్-2 ఈఓ శంకరయ్య మంథని లక్ష్మీనారాయణ దేవాలయానికి బదిలీ అయ్యారు. జగిత్యాల రాజరాజేశ్వరస్వామి దేవాలయ ఈఓగా ఉన్న కాంతారెడ్డి స్థానంలో పి వామన్‌రావు బాధ్యతలు చేపట్టనున్నారు.



ముగ్గురు కోళ్ల దొంగల అరెస్టు

సుల్తానాబాద్, జూలై 31: జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం విలువైన కోళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న యువకులను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నాటు కోళ్లు, విలువైన పందెం కోళ్లను దొంగతనం చేయడం వృత్తిగా ఎంచుకున్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన చీటి సతీష్‌రావు ఇంటివద్ద గల కోళ్ల ఫారం నుంచి ఇరవై కోళ్లను ఈ నెల 26న కారులో వచ్చి ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోళ్లను ఎత్తుకెళ్లింది ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మేచర్ల ఏసుబాబు, వీర్లపాడు మండలం గోకరాజుపల్లి కాలనీకి చెందిన గ్యార విష్ణు, జమ్మాళం బీసీ కాలనీకి చెందిన మేచర్ల కిషోర్‌లుగా నిర్ధారించారు. కోళ్లను అమ్ముకునేందుకు కారులో వెళుతుండగా బుధవారం ఉదయం సుల్తానాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. వీరి నుంచి 22 కోళ్లను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన వారిలో కిషోర్‌పై ఐదు కేసులు, విష్ణుపై రెండు కేసులు, మేచర్ల ఏసుబాబుపై ఏడు కేసులు ఆంధ్రప్రదేశ్‌లో నమోదై ఉన్నాయని వివరించారు. వీరు దొంగిలించే కోళ్లు ఒక్కొక్కటి యాభై వేల రూపాయల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని, అలాంటి కోళ్లను ఎత్తుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుని జల్సా చేసుకుంటారన్నారు. దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ నరేష్, ఏఎస్‌ఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, పీసీలు తిరుపతి నాయక్, రమేష్, రాజ్‌కుమార్‌లను ఏసీపీ అభినందించారు. సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ క్రిష్ణ





బైక్ పైనుంచి పడి ఒకరి మృతి

చొప్పదండి, జూలై 31: మండలంలోని వెదురుగట్టుకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి మృతిచెందాడు. ఎస్‌ఐ అనూష తెలిపిన మేరకు.. వెదురుగట్టుకు చెందిన జిల్లా శంకరయ్య (52)ఆటో నడుపుకుంటూ వ్యవసాయం చేస్తుంటాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా బైక్ అదుపు తప్పి శంకరయ్య కింద పడిపోయాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శంకరయ్య మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న జిల్లా శంకరయ్య మృతదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలు

గంభీరావుపేట, జూలై 31: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన తీర్పు వెల్లడించినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకా రం.. కోనారావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన కుంట నాగరాజుకు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన వసంతతో 2005లో వివాహం జరిగింది. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నేళ్లకు అదనపు కట్నం కోసం భర్త నాగరాజు వేధింపులకు గురిచేయగా 2009లో గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో వసంత ఫిర్యాదు చేసింది. పోలీస్‌లు నాగరాజుపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యమగంటి సతీష్‌గౌడ్ వాదించారు. గంభీరావుపేట ఎస్సై, సీఎంఎస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్‌రెడ్డి ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో నిందితుడు నాగరాజుకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమ న్యాయమూర్తి సృజన తీర్పు చెప్పినట్టు ఎస్సై వివరించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

వీణవంక,జూలై31:మండలంలోని బొంతుపల్లి గ్రామనికి చెందిన పోలు సత్తమ్మ (84)బావిలో పడి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం బహిర్భుమికి వెళ్లి చాలాసేపు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అనుమానంతో ఇంటి దగ్గరలోని బావిలో వెతకగా శవమై కనిపించినట్లు తెలిపారు.మా తల్లి మతిస్థిమితం సరిగా లేక బహిర్భుమికి వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్టు మృతురాలు కూమారుడు పోలు మల్లేష్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

ఇసుక డంపులపై పోలీసుల దాడులు

మానకొండూర్, జూలై 31 : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సుమారు 40 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకొని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు లింగాపూర్‌లోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న టీఎస్ 02 యుసి 9929 ఇసుక ట్రాక్టర్‌ను మండలంలోని అన్నారం గ్రామంలో పట్టుకొని డ్రైవర్ అనిల్, యజమాని తాల్ల సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

మానకొండూర్, జూలై 31 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. టిప్పర్ డ్రైవర్ నేర్నాల శ్యాం, యజమాని పిల్లి మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

కరీంనగర్ అర్బన్, జూలై 31: ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. కోరుట్లలో విధులు నిర్వహిస్తున్న జ్యోతి ఐజీ కార్యాలయానికి, డీఐజీ కార్యాలయంలో పనిచేసే డి సుజాత జగిత్యాలకు బదిలీ అయ్యారు. డి అశోక్ ఆదిలాబాద్ నుంచి కోరుట్లకు బదిలీ అయ్యారు. జె షన్‌నాయక్ జగిత్యాల నుంచి భీమదేవరపల్లికి, ఎండీ మక్సూద్ అలీ హుజూరాబాద్ నుంచి ఆదిలాబాద్ అడిట్‌కు బదిలీ అయ్యారు. ఎం బాలకిషన్ లక్షెట్టిపేట నుంచి రామగుండం, అప్పారావు సుల్తానాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. బి ప్రియాంక మంథని నుంచి మంచిర్యాలకు, ఎల్ ఉమాదేవి కరీంనగర్ డిఐజీ కార్యాలయం నుంచి అడిట్‌కు, జె మనోహర్ కరీంనగర్ అడిట్ నుంచి చేర్యాలకు, ఎస్ రాజేష్ కరీంనగర్ రూరల్ నుంచి గజ్వేల్‌కు, జె పద్మ గంగాధర నుంచి ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎస్‌పార్థసారధి సిరిసిల్ల నుంచి కరీంనగర్ డీఐజీ కార్యాలయానికి, సీహెచ్ సురేంద్రబాబు వేములవాడ నుంచి ఎల్లారెడ్డికి, ఆర్ వెంకటవీరస్వామి రామాయంపేట నుంచి సిరిసిల్లకు, ఎండీ ఇంతియాజ్ హుస్నాబాద్ నుంచి హుజూరాబాద్‌కు, అఫ్జల్‌నూర్‌ఖాన్ ఎల్లారెడ్డి నుంచి గంగాధరకు, ఎండీ అబ్దుల్ జబ్బర్ దోమకొండ నుంచి హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇసుక లారీల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 31: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఖాజీపూర్ వాగు నుంచి లారీలలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలోని పెద్దకాల్వల, బాబుపేట్, తారకరామానగర్ గ్రామాలకు చెందిన వాహన డ్రైవర్లు గుండవేని నాగేష్, దూల వెంక టేష్, పల్లపు కుమార్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బీమా చెక్కులు అందజేత

కరీంనగర్ క్రైం, జూలై 31: ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఇటీవల వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు బుధవారం అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు) ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఉమ్మడి జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి అందిన ఇన్సూరెన్సు చెక్కులను అందజేశారు. సిరిసిల్ల జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి, కామారెడ్డి జిలాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి వేర్వేరుగా నాలుగు లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోపి

ఎల్లారెడ్డిపేట, జూలై 31: ప్రజలను మభ్య పెట్టి వంచించడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అవలంబిస్తున్న తీరు చూస్తుంటే ఆ రెండు పార్టీలు ఒక్క గూటి పక్షులేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. పల్లెల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తమ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి గత పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు మద్దతు పలికి గెలిపించాలన్నారు. సమావేశంలో నాయకులు బుగ్గారెడ్డి, సాయిలు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, నరేశ్, స్వామి, జితేందర్‌రెడ్డి, రవి, గాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సాయికుమార్, రవినాయక్, రాజు, ఆంజనేయులు, సంజీవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రాజుయాదవ్, జవహర్, ప్రకాశ్, మల్లయ్య, పర్శరాంరెడ్డి, గణేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైంది

సిరిసిల్ల రూరల్, జూలై 31: ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు ద్యావనపల్లి పరమేష్ పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, డీఈవో రమేష్‌కుమార్ పాల్గొని పరమేష్ సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూక్యరెడ్డినాయక్, ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ, లకావత్ మోతీలాల్, ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాసరావు, గుత్తికొండ రాజశేఖర్, కోడం భారతి, అడువ కీర్తి, ఎండీ సలావోద్దీన్, ఇప్పకాయల ప్రకాష్, శరత్‌బాబు, ఎస్‌కె మోయినోద్దీన్, కరుణశ్రీ పాల్గొన్నారు.

నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌గా మండేపల్లి యువకుడు


ట్రోఫీతో హృతిక్‌గౌడ్

తంగళ్లపల్లి, జూలై 31:నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తంగళ్లపల్లి మండలం మండేపల్లికి చెందిన మెరుపుల హృతిక్‌గౌడ్ చాంపి యన్‌గా నిలిచాడు. ప్రస్తుతం హృతిక్ కుటుంబం ఉపాధి రీత్యా మహారాష్ట్రలో ఉంటోంది. మెరుపుల హృతిక్ మహారాష్ట్రలోనే సీఏ చదువుతూ కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొంది పోటీల్లో పాల్గొన్నాడు. జూన్‌లో మహారాష్ట్ర స్టేట్ జలగావ్‌లో జరిగిన కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. వాకో ఇండియా కిక్ బాక్సిం గ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి 28 వరకు గోవాలో నిర్వహించిన ఆల్ ఇండియా నేషనల్ కిక్ బాక్సింగ్ 2024 పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ముస్తాబాద్, జూలై 31 : బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీఆర్ఎస్ బీసీ విభాగం జిల్లా నాయకుడు దొరగొల్ల బాలయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి బహిరంగ సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 23 శాతం నుంచి 42 శాతానికి బీసీ రిజర్వేషన్‌ను పెంచాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌ను సంవత్సరానికి 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో 9200 కోట్లకు బదులుగా 20 వేల కోట్లు మంజూరు చేయాలన్నారు. వృత్తి బజార్ సముదాయలను ఏర్పాటు చేయాలన్నారు. చాకలి, కమ్మరి, వడ్రంగి, కుమ్మరి, స్వర్ణకారుల వంటి చేతి వృత్తుల వారికి ఉచితంగా షాపింగ్ స్థలాలను అందించాలన్నారు. బీసీలకు కొత్త గురుకులాలను ఏర్పాటు చేయాలని, వ్యాపారాలకు, ఉన్నత విద్యకు పది లక్షలను పూచికత్తు లేకుండా వడ్డీ లేని రుణాలను అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు జాల భిక్షపతి, బండి ఎల్లం, గుండవేని సతీశ్, అనమేని రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కాంగ్రెస్ నాయకుడు

గంభీరావుపేట, జూలై 31:లారీలో ఇరుకున్న వ్యక్తిని కాపాడి కాంగ్రెస్ నాయకుడు మానవత్వం చాటుకున్నారు. కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి శివారులో మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు కోళ్ల దాన లారీ బోల్తా పడగా సూపర్ వైజర్ మహేష్ లారీలో ఇరుక్కున్నాడు. ఆ మార్గంలో వెళ్తున్న గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ కాపాడేందుకు శ్రమించారు. పోలీసులకు సమచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది పరికరాలతో డోర్‌ను విరగొట్టి మహేష్‌ను బయకు తీశారు. మహేష్‌ను కామారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు.

బాధ్యతలు స్వీకరించిన సెస్ ఏఈ

ఇల్లంతకుంట, జూలై 31: ఇల్లంతకుంట సెస్ ఏఈగా రంగు నగేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏఈగా పనిచేసిన రాకేష్‌రెడ్డి బదిలీపై సెస్ కార్యాలయానికి వెళ్లగా వేములవాడ రూరల్ ఏఈగా పనిచేసిన నగేష్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

పేదల సేవే లక్ష్యంగా పనిచేయాలి


కవర్లను అందజేస్తున్న ఎస్సై గణేశ్

ముస్తాబాద్, జూలై 31 : పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఎస్సై గణేశ్ అన్నారు. సిరిసిల్ల రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించిన టార్పలిన్ కవర్లను మండలంలోని నామాపూర్‌లో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల యజమానులకు బుధవారం అందజేశారు. రెడ్ క్రాస్ డైరెక్టర్ గుడ్ల సునిల్, వేణు, పీసీ రాజశేఖర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, దశరథం, అనిల్, బాల్‌రాజు పాల్గొన్నారు.

స్వశక్తి రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఇందిరా మహిళా శక్తి ద్వారా రూ.500 కోట్ల రుణాల లక్ష్యం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలతో మహిళలు ఆదాయ వనరులను సృష్టించి, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు దాదాపు రూ.లక్ష కోట్ల రుణాలు అందజేసి ఆర్థికంగా వారిని బలోపేతం చేయాలని ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ప్రస్తుత సంవత్సరం జిల్లాలో ఉన్న మహిళా సంఘాలకు రూ.500 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలను చిన్నచిన్న వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు వినియోగించాలన్నారు. మహిళలు తమకు అందే రుణాలను వినియోగించి ఆదాయ వనరులను సృష్టించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలకు వివిధ వ్యాపారాల ఏర్పాటుపై ప్రభుత్వం అవగాహన కల్పించనుందన్నారు. పాడి పశువులు, కుట్టు మిషన్ కేంద్రాలు, మీ సేవ కేంద్రాలు, కుటీర పరిశ్రమలు, పౌల్ట్రీ, ఆహార శుద్ధి కేంద్రాలు కష్టం హైరింగ్ సెంటర్స్, మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్స్, మిల్క్ పార్లర్‌లు, క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మొదలగు రంగాలలో మహిళలు వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సలహాలు ఇతర సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందన్నారు. ప్రస్తుత సంవత్సరం మన జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 1800, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో 600 పాడి పశువుల యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కరీంనగర్ మిల్క్ డెయిరీతో సమన్వయం చేస్తామని, ఆసక్తి అర్హత కలిగిన మహిళా సంఘాల ద్వారా వాటిని ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలో 5123 మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న 3392 వ్యాపార యూనిట్ల విస్తరణ, 1607 నూతన వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ మండలంలో ఉన్న వ్యాపార యూనిట్లు నడిపే మహిళా సంఘాలతో చర్చించి వారి అనుభవాలను కలెక్టర్ తెలుసుకోవాలన్నారు. జిల్లాలో 31 యూనిట్ లు ఏర్పాటు చేసి స్కూల్ ఏకరూప దుస్తులు కుట్టించామన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే అవకాశం కల్పించి, కుట్టు కూలి పెంచడంపై మహిళా సంఘాల సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఏకరూప దుస్తులు కుట్టడంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ సన్మానించారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 120 ఆహార శుద్ధి కేంద్రాల, 5 కస్టమ్ హైరింగ్ సెంటర్లు, ఒక మిల్క్ పార్లర్, నాలుగు అమ్మ క్యాంటీన్లు, ఒక ఈవెంట్ మేనేజ్మెంట్, ఒక ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తున్నామని, ఆసక్తి అర్హత కలిగిన మహిళా సంఘాలతో వీటిని ఏర్పాటు చేయించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సంపూర్ణ సహకారం అందజేస్తామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జిల్లాలో 10 నూతన మీ సేవ కేంద్రాలను ఏఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ఆదాయ వనరులు కల్పన దిశగా ప్రభుత్వం రూపొందించిన పలు ప్రణాళికలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ముందుగా వివరించారు. ప్రతీ యూనిట్ ఏర్పాటు తీసుకోవాల్సిన చర్యలు, కలిగే లాభాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్ జిల్లా సమైక్య అధ్యక్షురాలు సరిత, కరీంనగర్ డెయిరీ డీఓ డాక్టర్ జయకర్, పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న నాబార్డు డీడీఎం దిలీప్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, పరిశ్రమల జీఎం భారతి, పీడీఎఫ్ శ్రీనివాస్, స్త్రీనిధి జోనల్ మేనేజర్ రవికుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు, స్వశక్తి సంఘాల ప్రతినిధులు

అనుమానిత యువకులకు గంజాయి పరీక్షలు


పరీక్ష నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రుద్రంగి, జూలై 31: రుద్రంగి మండల కేంద్రంలో గంజాయి తాగారనే అనుమానంతో కొందరు యువకులకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో బుధవారం గంజాయి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ప్రతీరోజు డ్రంకెన్ డ్రైవ్ టెస్ మాదిరిగానే అనుమానం వచ్చిన యువకులను గంజాయి టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రుద్రంగిలో యువకులకు నిర్వహించిన గంజాయి టెస్ట్‌లో నెగిటీవ్ వచ్చినట్లు తెలిపారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉప్పొంగుతున్న పల్వంచ వాగు



గంభీరావుపేట, జూలై 31:ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు పల్వంచ వాగు ఉప్పొంగుతోంది. కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు, సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు నుంచి గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరులోకి వరద నీరు వచ్చి చేరుతోది. మొత్తం 31 అడుగుల నీటి సామర్థ్యానికి మానేరు జలాశయంలో ప్రస్తుతం 15 ఫీట్ల వరకే నీరు ఉంది.

ఉపాధికోసం గల్ఫ్ బాట

- వారం రోజులకే పోలీసులకు చిక్కి - ప్రభుత్వ విప్‌చొరవతో ఇంటిబాట
- సిరిసిల్లకు చేరిన వలస కార్మికుడు


వలసకార్మికుడు రవి

సిరిసిల్ల క్రైం, జూలై 31: సిరిసిల్లలో డైయింగ్ పరిశ్రమలో సంక్షోభం కారణంగా ఉపాధికోసం గల్ఫ్ బాట పట్టిన కార్మికుడు వారం రోజులకే పోలీసులకు చిక్కాడు. ప్రభుత్వ విప్ చొరవతో బుధవారం ఇంటికి క్షేమంగా చేరాడు. సిరిసిల్ల పట్టణంకు చెందిన అకెన రవి (36), అతడి స్నేహితుడు శ్రీనివాస్ విజిట్ వీసాపై ఈనెల 17న దుబాయ్ వెళ్లారు. దుబాయ్ వెళ్లిన తర్వాత ఐదు రోజులు పనికోసం వెతికినా దొరకలేదు. దుబాయ్‌లో రోడ్ల వెంట తిరుగుతున్న రవిని అక్కడి పోలీసులు పట్టుకొని స్టేషన్‌లో వేశారు. నాలుగురోజులు పోలీస్ స్టేషన్‌లోనే రవి తిండితిప్పలు లేక గడిపాడు. రవితో పాటు దుబాయ్ వెళ్లిన అతడి స్నేహితుడు శ్రీనివాస్‌కు రవి కనిపించకపోవడంతో పనిదొరకక సిరిసిల్లకు వచ్చేశాడు. విషయం కుటుంబ సభ్యులకు చెప్పాడు. దుబాయ్ పోలీసుల చెరలో ఉన్న రవి మానసిక స్థితి బాగా లేకపోవడంతో అక్కడి పోలీసులు ఐదు రోజులకు వదిలేశారు. దీంతో వలస కార్మికుడు రవి దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అప్పటికే రవి దుబాయ్‌లో అదృశ్యమైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి కుటుంబసభ్యులు తీసుకెళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈనెల 29న దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీకి లేఖ రాయించి విచారణకు ఆదేశించారు. దీంతో ఎంబసీ అధికారులు స్పందించి విచారణ చేపట్టడంతో రవి ఆచూకీ లభించింది. షార్జా ప్రాంతంలో ఉన్న రవి ఆచూకి తెలుసుకున్న ఎంబసీ అధికారులు అతన్ని చేరదీశారు. నడువలేని నిస్సహాయ స్థితిలో ఉన్న రవిని ఇండియన్ ఎంబసీలో సురక్షితంగా ఉంచి కుటుంబసభ్యులకు సమాచారం అందించి దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షులు, సామాజిక సేవకులు గుండెల్లి నర్సింహులు సహకారంతో అవుట్ టికెట్ ఇచ్చి దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

బుధవారం ఉదయం రవి హైదరాబాద్ విమానాశ్రయానికి చేరడంతో సోదరులు వెళ్లి సిరిసిల్లకు క్షేమంగా తీసుకొచ్చారు. తన భర్త రవి క్షేమంగా ఇంటికి చేరడంతో భార్య రూప, సోదరులు, కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తనకు పునర్జన్మ లభించిందని రవి చెప్పాడు. ఇందుకు కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సామాజిక సేవకులు నర్సింహులుకు వలసకార్మికుడు రవి కృతజ్ఞతలు తెలిపాడు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఎల్లారెడ్డిపేట, జూలై 31: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని నాయకులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ రైతులకు రెండో విడత రూ.1.50 లక్షల లోపు రుణమాఫీ చేసిందన్నారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు మాఫీ చేసి మాట నిలుపుకోనుందన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, రాజునాయక్, రాజేందర్, దేవేందర్, భాస్కర్, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంభీరావుపేట : రెండో విడత రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మాజీ ఎంపీటీసీ నాగ భూషణం, నాయకులు ఎలుక రాజు, విఠల్, అజాం, మల్లేశం, దేవరాజు, రాజం, రమేష్, రాజనర్సు, బాలయ్య, గోపాల్‌రెడ్డి, రాజారాంరెడ్డి, బాల్‌రెడ్డి, స్వామి, దేవయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

బావిలో పడిన శునకం.. కాపాడిన ఫైర్ సిబ్బంది, పోలీసులు

కోనరావుపేట జూలై 31:కోనరావుపేట మండలం మంగళపల్లెలో ప్రమాదవశాత్తు శునకం మంచినీటి బావిలో పడగా పోలీసులు కాపాడారు. బుధవారంశునకం అరుపులు విన్న మంగళపల్లె గ్రామపంచాయతీ పంపు ఆపరేటర్ ముత్తయ్య బావిలోకి చూశాడు. శునకం బావిలో పడినట్టు గుర్తించి కోన రావుపేట పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు బయటకు తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వేములవాడ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి ఫైర్ ఇంజన్ తెప్పించారు. దీంతో ఫైర్ సిబ్బంది పోలీసులు శునకాన్ని బయటకు తీశారు

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

వీర్నపల్లి, జూలై 31: రైతులు విద్యుత్ బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని, సిబ్బందికి సహకరించాలని సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో విద్యుత్ వినియోగ రైతులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో లైన్ మెన్ మహేందర్, ఉప సర్పంచ్‌ల పోరం మాజీ మండల అధ్యక్షుడు బోయిని రవి పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

వీర్నపల్లి, జూలై 31: నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తోందని సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో లబ్ధిదారులు యాస వనజకు రూ.18 వేలు, సామల్ల సతీష్‌కు రూ.42 వేలు, బోడ ప్రవీణ్‌కు రూ.18,500, కమటం చంద్రశేఖర్ రూ.18 వేల విలువ చేసే చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మాజీ మండల అధ్యక్షుడు బోయిని రవి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

వీర్నపల్లి, జూలై 31: మారుమూల గ్రామాల్లో ప్రజలు పౌరహక్కులకు భంగం కలిగించొద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో అధికారులతో కలిసి పౌర హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కుల వివక్షకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంటరానితనాన్ని రూపుమాపాలన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాల న్నారు. అనంతరం పౌర హక్కులపై ప్రతిజ్ఞ చేయించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఆయా కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాకారులకు సముచిత స్థానం కల్పించిన సీఎం



తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 31: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సముచిత స్థానాన్ని కల్పించారని తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడమల శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన 583 మంది కళాకారులకు గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని, పదేళ్లుగా నెలకు రూ.24,514 గౌరవ వేతనంతో పని చేస్తున్న తమకు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పీఆర్సీ 30 శాతంతో రూ.31,868 వేతనాలు పెంచి కళాకారుల కుటుంబాలలో వెలుగులు నింపిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలనతో తమకు సముచిత స్థానాన్ని కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాముల రామచంద్రం, ప్రధాన కార్యదర్శి వంతడుపుల ఝాన్సీ, నాయకులు ఆకునూరి దేవయ్య, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, పొత్తూరి రాజు, సంజీవ్, కిన్నెర, శ్రీలత, శిరీషా, లావణ్య పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

ముస్తాబాద్, జూలై 31 : ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ముస్తాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అంజాగౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మూడు విడతలుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అధికారులను ఆదేశిస్తే పలు సాంకేతిక కారణాలతో అధికారులు కొర్రీలు పెడుతున్నారన్నారు. సాంకేతిక లోపాలతో ఉన్న రైతుల జాబితాను ఇప్పటికి ఛేదించలేకపోతున్నారన్నారు. ఆధార్ లింక్ సరిగా లేదని, ధరణితో ఉన్న భూమి ఆన్‌లైన్‌లో చూపించడం లేదన్నారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగడం లేదని ఆరోపించారు. ఆ సాంకేతిక లోపాలు ఏమైనా ఉంటే రైతులకు వ్యవసాయాధికారుల ద్వారా సమాచారం పంపి 100 శాతం రైతులకు రుణమాఫీ జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి క్రాంతి, గిరి, కళ్యాణ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే వరకు రిలే దీక్షలు


సిరిసిల్లలో ఎండలోనే దీక్ష చేస్తున్న నేతన్నలు

సిరిసిల్ల రూరల్, జూలై 31:సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభాన్ని నివారించి నేతన్నలకు ఉపాధి కల్పించేవరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు ప్రకటించారు. జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన రిలేనిరాహార దీక్ష శిబిరాన్ని పోలీసులు తొలగించారు. బుధవారం దీక్ష చేసేందుకు వచ్చిన జేఏసీ నాయకులకు టెంట్ కనిపించకపోవడంతో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా దీక్ష శిబిరం ప్రాంతంలోనే పదో రోజు ఎండలోనే కొనసాగించారు. నేతన్నలు బోద్దుల భాస్కర్, గోవిందు ఉమశంకర్, గోవిందు జనార్ధన్, సుందరపల్లి సతీష్, బైరి మధు, వేముల సంతోష్, ఎనగందుల రాజమల్లు దీక్షలో కూర్చున్నారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, టీడీపీ నాయకులు తీగల శేఖర్‌గౌడ్, మచ్చ అంజనేయులు, మ్యాన వెంకటేశం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతంరవి, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా దీక్షలు చేస్తుంటే మంగళవారం అర్ధరాత్రి రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో దీక్ష శిబిరాన్ని తొలగింప జేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తరువాత అణచివేయాలని చూడడం సరికాదని అన్నినరు. సిరిసిల్లలో పోలీసుల తీరుకు నిరసనగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సత్యం, వెల్దంది దేవాదాస్, మోర రాజు, అంకాలపు రవి, మండల బాలరాజు, బండారి అశోక్, సిరిమల్ల సత్యం, గోవిందు రవి, వెల్దండి శంకర్, పిస్క మధు, కనుకరాజు, బూట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ఎల్లారెడ్డిపేట, జూలై 31: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై రమాకాంత్ హెచ్చరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఇల్లంతకుంట, జూలై 31: రోడ్డుభద్రతా నియమాలను ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామంలో బుధవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాన్ని నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరిగినా, ఎవరైనా తాగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు సమాచారం ఇవ్వవద్దని సూచించారు.

కేటీఆర్ రాక ముందు మరమగ్గాలే లేవా?


కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప

సిరిసిల్ల టౌన్, జూలై 31: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ రాక ముందు సిరిసిల్లలో మరమగ్గాలే లేవా? అని, సిరిసిల్ల ప్రజలకు అన్నం పెట్టాడా సున్నం పెట్టాడా అన్నది పద్మశాలి ప్రజలు గ్రహించాలని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు పద్మశాలీలకు ఉచిత రేషన్ బియ్యం ఇచ్చారని, సారంపల్లిలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కోసం స్థలం తీసుకున్నారని అన్నారు. సిరిసిల్లలో నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 13వేల అంత్యోదయ కార్డులను ఇచ్చి సిరిసిల్ల నేత కార్మికులకు అండగా నిలిచారన్నారు. తెలంగాణ వచ్చాక కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాక సిరిసిల్లలో అంత్యోదయ కార్డులు 3వేలకు చేరుకున్నాయని, మిగతా 10 వేల కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాటన్ మిల్లును కూడా ప్లాట్లు చేసుకొని అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.21 కోట్ల కరెంట్ బిల్లులను పెండింగ్ పెట్టారని, రూ.275 కోట్లు బతుకమ్మ చీరలకు సంబంధించిన బకాయిలు పెట్టాడని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు నీతులు మాట్లాడుతున్నారన్నారు. నిజంగా కేటీఆర్ బతకమ్మ చీరలతో అన్నం పెడితే ఈ ఆరు నెలలకే కార్మికులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారని ప్రశ్నించారు. పద్మశాలీలపై ప్రేమ ఉంటే నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మంత్రిగా ఉన్న కేటీఆర్ తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల మాదిరిగా జీవోను ఎందుకు తీసుకురాలేదన్నారు. తప్పులు అన్ని మీదగ్గర పెట్టుకొని మహేందర్‌రెడ్డితోనే బతుకమ్మ చీరల బంద్ అయ్యాయనడం మూర్ఖత్వమన్నారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరలతో ఎవరు బతికారన్నది బయటకు రావాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టి మనల్ని ప్రభుత్వం నుంచి దూరం చేయాలని చూస్తున్నారని సిరిసిల్ల పద్మశాలీలు, ప్రజలు గ్రహించాలని అన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, జిల్లా నాయకులు వెల్మల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, పిస్క మధు పాల్గొన్నారు.